ప్రజాశక్తి

శుక్రవారం 9 ఫిబ్రవరి 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

రాజ్యసభకు వైవి..!

- ఒంగోలు పార్లమెంటులోనూ వీడిన సందిగ్ధం
- సిఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లాకు చెందిన టిటిడి మాజీ ఛైర్మన్, వైసిపి అగ్రనేతల్లో ఒకరైన వైవి.సుబ్బారెడ్డిని అధిష్టానం పార్టీ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేసింది. గురువారంనాడు మిగతా అభ్యర్థులతో కలిసి వైవి.సుబ్బారెడ్డి సిఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ముందుగా అనుకున్నట్లుగానే వైవి రాజ్యసభకు వెళ్లనున్నారు. దీంతో కొంతకాలంగా ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి వ్యవహారంపై కొనసాగుతున్న సందిగ్ధం కూడా వీడింది. వైవి మళ్లీ ఒంగోలులో పోటీ చేస్తారనే ప్రచారం రావడం.. దానికి ఆయన సమాధానాలు ఇవ్వడం వంటివి కూడా ఇటీవల జరిగాయి. ఈ నెల 27న రాజ్యసభ ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికల కమిషన్ ఈ మేరకు షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. ఎమ్మెల్యేల కోటాలో రాజ్యసభకు సభ్యులను ఎన్నుకోనున్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్నందున ఎమ్మెల్యేల ఓట్లు కీలకంగా మారాయి. ఎందుకంటే ఇప్పటికే రాష్ట్రంలో చాలా నియోజకవర్గాల్లో వైసిపి ఎమ్మెల్యేలను పక్కనబెట్టి కొత్త సమన్వయకర్తలను నియమించింది. వీరంతా ఓటేస్తారా? లేదా? అనే సంశయనం కూడా కలుగుతోంది. ఇలాంటి జాబితాలో జిల్లాలోనూ ముగ్గురు ఎమ్మెల్యేలున్నారు. కనిగిరి, దర్శి, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు బుర్రా మధుసూదన్ యాదవ్, మద్దిశెట్టి వేణుగోపాల్, సుధాకర్‌బాబు తదితరులున్నారు. వీరి ముగ్గురికీ టిక్కెట్టు ఇవ్వలేదు. వీరిని పక్కనబెట్టేయడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అసెంబ్లీ సమావేశాలకు కూడా ఒకరు తప్ప మిగతా ఇద్దరూ వెళ్లలేదు. అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. ఇంకా ఖరారు కాకుండా సందిగ్ధంలోనూ కొందరున్నారు. ఉమ్మడి ప్రకాశంలో కందుకూరులో సిట్టింగు ఎమ్మెల్యే మానుగుంటకే ఇవ్వాలని నిర్ణయించినా జాబితాల్లో పేరు రాలేదు. దీంతో ఆయనపైనా రకరకాలు ఊహాగానాలు సాగుతున్నాయి. వాటిని ఆయన ఖండిస్తున్నారు. ఏదేమైనా ఇప్పుడు పార్టీలో ఉన్న ఎమ్మెల్యేల్లో అధిష్టానంపై అసంతృప్తిగా ఉన్న వాళ్లు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. ఓటేస్తారా? పోటేస్తారా? అనే చర్చ సాగుతోంది. వీరిని ఏదో రకంగా ఎన్నికల వరకూ కట్టడి చేసుకునేందుకు అధిష్టానం దృష్టి సారించాల్సిన పరిస్థితి కూడా వచ్చింది.

ఒంగోలులో పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆశాలు

పోలీసుల తీరుకు నిరసనగా గిద్దలూరులో ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

ఆశాలపై నిర్బంధం

- ఎక్కడికక్కడ అరెస్టులు..
- సిఐటియు నేతల గృహనిర్బంధం
- పోలీసులకు తీరును వ్యతిరేకిస్తూ ఆశాల నిరసనలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్, బాపట్ల జిల్లా

డిమాండ్ల సాధన కోసం ఆశావర్కర్లు చలో విజయవాడకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు నిర్బంధం ప్రయోగించారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఆశావర్కర్లు, సిఐటియు నేతలను ఎక్కడికక్కడే అరెస్టు చేశారు. ఇళ్ల వద్ద పోలీసులను కాపలాగా పెట్టారు. కొందరు యూనియన్ నాయకులను, ఆశాలను తీసుకెళ్లి పోలీసు స్టేషన్‌లో ఉంచారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఘటలనే చోటుచేసుకున్నాయి. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని, సెలవులు, మెడికల్ లీవులు ఇవ్వాలని, వెటర్నటీ లీవులు ఇవ్వాలని, ఆశాలతో సంబంధంలేని పనులు చేయించరాదని, రిటైర్‌మెంట్స్ బెనిఫిట్స్ ఇవ్వాలని ఆశాలు డిమాండ్ చేస్తున్నారు. చనిపోయిన ఆశావర్కర్స్‌కు రూ.10 లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ ఇవ్వాలని, మట్టిఖర్చులు ఇవ్వాలని, ఖాళీ ▶ 2లో

పోలీసుల తీరుకు నిరసనగా రేపల్లెలో రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు, ఆశావర్కర్లు

నేడు, రేపు బాలల పండుగ

- ఒంగోలులో 'ప్రకాశం బాలోత్సవం'
- జిల్లావ్యాప్తంగా 83 స్కూళ్ల నుంచి హాజరుకానున్న విద్యార్థులు
- రెండు రోజుల పాటు విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక కార్యక్రమాలు

పివిఆర్ పాఠశాల ఆవరణలో బాలోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

బాలల పండుగకు ఒంగోలులోని పివిఆర్ బాలుర పాఠశాల ఆవరణ వేదికైంది. 'ప్రకాశం బాలోత్సవం' కార్యక్రమం శుక్ర, శనివారాలలో పివిఆర్ బాలుర పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రెండు రోజుల పాటు పిల్లల ఆటలు, పాటలు, రచనలు, కళారూపాలు కన్నులవిందు చేయనున్నాయి. ఎప్పుడూ క్లాస్ రూంలో ఉండే విద్యార్థులు వారి ప్రతిభపాటవాలను ప్రదర్శించేందుకు బాలోత్సవం స్వాగతం పలుకుతోంది. శుక్రవారం ఉదయం 10 గంటలకు బాలోత్సవం ప్రారంభం కానుంది. విద్యార్థులను సీనియర్స్, జూనియర్స్‌గా విభజించి పలు అకడమిక్ ఈవెంట్స్, కల్చరల్ ఈవెంట్స్‌ను నిర్వహించనున్నారు. అకడమిక్ ఈవెంటోలో శుక్రవారం సీనియర్ సైన్స్ ఎగ్జిబిషన్, చిత్రలేఖనం, వ్యాసరచన తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషులు ఉంటాయి. కల్చరల్ ఈవెంట్స్‌లో జానపద నృత్యం, శాస్త్రీయ నాటకం, లఘునాటిక గ్రూప్, దేశభక్తి గీతాలపాన గ్రూప్, ఫ్యాన్సీ డ్రస్, విచిత్ర వేషధారణ, ముకాభినయం, ఏకపత్రాభినయం ప్రదర్శిస్తారు. శనివారం అకడమిక్ ఈవెంట్స్‌లో బెస్ట్‌ఫ్రం వేస్ట్, మట్టిబొమ్మలు, ఇంగ్లీషులో, తెలుగులో ఉర్దూ బాషలలో వృక్తత్వపోటీలు, పద్యం భావం, మెమొరి టెస్ట్ ఉంటాయి. కథ చెబుతాం.. ఊ కొడతారా కార్యక్రమం ఉంటుంది. కల్చరల్ ఈవెంట్స్‌లో సీనియర్‌తో జానపద నృత్యం గ్రూపు, సబ్ జూనియర్స్‌తో రైమ్స్ ఇంగ్లీషు, శాస్త్రీయ నృత్యం, తెలుగు రైమ్స్, లఘునాటిక గ్రూప్, కోలాట ప్రదర్శనలు ఉంటాయి. ఈ కార్యక్రమాల నిర్వహణలకు అవసరమైన స్టేజీలను సిద్దంచేసే పనిలో నిర్వాహకులు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 83 స్కూల్స్ నుంచి వేలాది మంది విద్యార్థులు బాలోత్సవానికి తరలిరానున్నారు. వారికి అన్ని రకాల వసతులు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులు వారిలో ఉండే కళలను, నైపుణ్యాలను, నలుగురితో పంచుకునేలా బాలోత్సవం ముస్తాబవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల బాలోత్సవాలు నిర్వహణ జరిగినా ప్రకాశం జిల్లాలో జరగడం మాత్రం ఇదే ప్రథమం, ఇందుకే దీనికి పిల్లల ప్రథమ పండుగగా నామకరణం చేశారు. రాజకీయ పార్టీలు, సంఘాలకు సంబంధం లేకుండా సామాజిక అంశాల మీద పనిచేసే సంఘాలు కమిటీగా ఏర్పడి బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. అందరం వెళ్లి చూసొద్దాం పదండి..

డిఇఒగా సుభద్ర బాధ్యతల స్వీకరణ

- అభినందించిన ఉపాధ్యాయ సంఘాల నేతలు

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డిఇఒ సుభద్ర

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా విద్యా శాఖాధికారిగా డి.సుభద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. తొలుత కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్‌ను డిఇఒ సుభద్ర మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. డిఇఒను యుటిఎఫ్, ఏపిటిఎఫ్, తెలుగు పండిత పరిషత్, ప్రధానోపాధ్యాయుల సంఘం నేతలు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. డిఇఒ సుభద్ర తూర్పుగోదావరి జిల్లా విద్యా శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా, డిప్యూటీ డిఇఒగా, డిఇఒ పూర్తి అదనపు బాధ్యతలలో పనిచేశారు. డిప్యూటీ డిఇఒగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ప్రకాశం జిల్లా డిఇఒగా నియమితులయ్యారు. ఉపాధ్యాయులు విద్యాశాఖ కుటుంబసభ్యులని, వారి సమస్యలు పరిష్కరించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

'మెప్మా'లో కుంభకోణాన్ని నిగ్గుతేల్చండి

తెలుగుదేశం నాయకుల డిమాండ్

3లో ▶

వైపాలెంలో మూతపడ్డ వైటిసి

గిరిజన యువతకు ఉపాధి కరువు.. తప్పని వలసలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ కోసం ఏర్పాటు చేసిన వైటిసి (యూత్ ట్రైనింగ్ సెంటర్లు) మూడేళ్లుగా మూతపడ్డాయి. దీంతో ఒకవైపు ప్రభుత్వ లక్ష్యం నీరుకారగా, మరోవైపు యువతకు ఉపాధి శిక్షణ కరువైంది. ఇందులో పని చేస్తున్న సిబ్బందికి నెలల తరబడి వేతనాలందక ఇబ్బందులు పడుతున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన వైటిసి కేంద్రాలు ఉపాధి శిక్షణ లేక వెలవెలబోతున్నాయి. గత టిడిపి ప్రభుత్వ హయాంలో యర్రగొండపాలెం గిరిజన నిరుద్యోగ యువతకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశంతో వైటిసిలను ఏర్పాటు చేశారు. రూ.మూడు కోట్ల వ్యయంతో భవనాలు నిర్మించారు. వైటిసిల నిర్వహణ, అందులో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాల కోసం ట్రైకార్ నిధులను వినియోగించేవారు. 2017 నుంచి 2019 వరకు ఎంతోమంది నిరుద్యోగ గిరిజన యువతీ యువకులకు కంప్యూటర్, టైలరింగ్, డ్రెస్ మేకింగ్, డ్రైవింగ్ తదితర విభాగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేవారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు రోజుకు రూ.160 చొప్పున సమకూర్చేవారు. రెండు నెలల కాలం శిక్షణ ఉండేది. శిక్షణ నిర్వాహణకు రూ.10 వేలు చొప్పున వేతనం చెల్లించేవారు. శిక్షణ కోసం కంప్యూటర్లు, కుట్టు మిషన్లు సమకూర్చారు. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు యువత హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం వంటి దూర ప్రాంతాల్లో ఉపాధి కోసం వెళ్లి స్థిరపడ్డారు.

మూడేళ్లగా మూత..

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది పాటు వైటిసిల నిర్వహణ సక్రమంగా సాగింది. అయితే కరోనా పేరుతో

మూతపడ్డ వైటిసి

శిక్షణ నిలిపివేశారు. కోవిడ్ తగ్గుముఖం పట్టినా శిక్షణా కేంద్రం తిరిగి ప్రారంభించలేదు. మూడేళ్లుగా ఉపాధి శిక్షణ లేక నిరుద్యోగ గిరిజన యువత నిరాశలో ఉన్నారు. ప్రస్తుతం రూ.మూడు కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాలు బోసిపోయి దర్శనమిస్తున్నారు. గిరిజన యువతకు ఉపాధి శిక్షణ లేకపోవడంతో వలసలు వెళ్లిపోతున్న పరిస్థితి నెలకొంది.

ఉపాధి శిక్షణ ఇవ్వాలి

తాటి నాగేశ్వరరావు, యర్రగొండపాలెం

రాష్ట్ర ప్రభుత్వం వైటిసిలను తిరిగి ప్రారంభించి గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధిలో శిక్షణ ఇవ్వాలి. యర్రగొండపాలెంలో ఏర్పాటు చేసిన వైటిసి ఐదు మండలాల్లోని గిరిజన యువతీ యువకులకు ఎంతో ఉపయోగకరం. శిక్షణ పొందడం ద్వారా వీరికి ఉపాధికి అవకాశం ఉంటుంది.

తప్పని వలసలు

కొండలు, పునరావాస కాలనీ

వైటిసిలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో శిక్షణ కరువైం ది. గిరిజన ప్రాంతంలో యువత ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వలసలు వెళ్లిపో తున్న పరిస్థితి నెలకొంది. గిరిజన యువత కు ప్రభుత్వం నుంచి భరోసా కరువైంది.

వైటిసిలకు నిధులు కేటాయించాలి

బొజ్జా వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకుడు, గారపెంట

వైటిసిల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించి ఉపాధి శిక్షణ అందించాలి. నిధుల్లేక ఉపాధి శిక్షణ మరుగున పడింది. పదో తరగతి, ఇంటర్ చదువుకున్నా ఉపాధి అవకాశాలు లేవు. ప్రభుత్వం స్పందించాలి.

ఆశాలపై నిర్బంధం

(మొదటిపేజీ తరువాయి)

పోస్టులను భర్తీ చేయాలని, రాజకీయ జోక్యం ఆపాలని, ఎఎన్ఎంలను జిఎన్ఎంలుగా ట్రైనింగ్ చేసి వారికి వెయిటింగ్ మార్కులు ఇవ్వాలని కోరుతున్నారు. నాణ్యమైన సెల్‌ఫోన్స్, రికార్డు బుక్స్ ప్రభుత్వమే ఇవ్వాలని, రిటైర్డ్‌మెంట్ వయస్సు పెంచాలనే డిమాండ్లలో ఆశావర్కర్లు గత అనేక రూపాయాల్లో ఆందోళనలు, పోరాటాలు చేస్తున్నారు. ఆశావర్కర్లు చివరిసారిగా సిఎంకు చెబుదాం అని గురువారం విజయవాడ వెళ్లే కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఇదేదో నేరం చేసినట్లు ఆశావర్కర్లను, వారికి మద్దతిస్తున్న సిఐటియు నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టుచేశారు. గురువారం ఉదయం నుంచే నగరంలోని సిఐటియు నేతలను, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులను గృహనిర్బంధాలు చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావును హౌస్ అరెస్టు చేశారు. జి.శ్రీనివాసులు, మహేష్, ఇతర నాయకులను పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. కొన్ని చోట్ల నేతలకు పోలీసుస్టేషన్‌లలో మంచినీళ్లు కూడా ఇవ్వలేదు. వాళ్లు బాత్‌రూంకు పోతున్నా పోలీసులు కాపలా వెళ్లే పరిస్థితి కనిపించింది. పోలీసులు తీరుకు నిరసనగా రెండు జిల్లాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. పలు చోట్ల ఆశాలు ధర్నాలు చేశారు. బాపట్ల, రేపల్లెలో ఆశాలు రాస్తారోకో నిర్వహించారు.

ఆర్మ్‌డ్ అధికారులకు ఎస్‌పి సత్కారం

ప్రజాశక్తి-బాపట్ల: శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ అధికారులు కీలకపాత్ర పోషించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఇటీవల జరిగిన బదిలీలలో బాపట్ల జిల్లాలో విధులు నిర్వహించే ఏఆర్ డిఎస్‌పి ఎండిహెచ్ ప్రేమ్‌కుమార్, ఆర్ఐ లు ఎల్‌మన్మథరావు, బి శ్రీకాంత్ నాయక్, ఎల్ గోపీనాథ్, ఆర్ఎస్ఐలు సీజే భరత్, ఎన్ గోపి వివిధ జిల్లాలకు బదిలీపై వెళుతున్నందున గురువారం జిల్లా పోలీస్ క్యాంప్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో అధికారులు, సిబ్బంది వీడ్కోలు సభ నిర్వహించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో కీలకంగా వ్యవహరించిన ఏఆర్ అధికారులు ఒక్కసారిగా బదిలీ అవ్వటం తీరని లోటని, పోలీస్ శాఖలో బదిలీలు సహజమే కనుక బాపట్ల జిల్లాలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీసు అధికారులు బదిలీపై వెళుతున్న కొత్త ప్రదేశంలో కూడా సమర్థవంతంగా విధులు నిర్వహించి పై అధికారుల మన్ననలు పొందుతూ వారి పోస్ట్ కు మరింత వన్నె తేవాలని ఎస్పీ ఆకాంక్షించారు. అనంతరం పోలీసు అధికారులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేసినారు. ఈ వీడ్కోలు అభినందన సభలో బాపట్ల డిఎస్పీ టి వెంకటేశులు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ వి మల్లికార్జున, డిటిఆర్బీ ఇన్‌స్పెక్టర్ సింగయ్య, జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

యాత్ర-2 సినిమాను తిలకించిన బూచేపల్లి

ప్రజాశక్తి- దర్శి

దర్శిలోని శివశంకర్ థియేటర్‌లో యాత్ర-2 సినిమాను గురువారం ప్రదర్శించారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి నందిని యాత్ర-2 సినిమాను అభిమానులతో కలిసి తిలకించారు. సినిమా విడుదల సందర్భంగా బూచేపల్లి ఆధ్వర్యంలో మొత్తం మూడు షోలు ఉచితంగా ప్రదర్శించారు.

అభిమానులకు విక్టరీ చూపుతున్న బూచేపల్లి

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సులలో చేరుటకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ శ్రీనివాసాచార్యులు గురువారం తెలిపారు. బిఎస్సీ కంప్యూటర్స్, బిఎస్సీ బోటనీ, బికాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఏ పొలిటికల్ సైన్స్‌లో అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'కిలోమీటరు కూడా నీరు రాలేదు'

ప్రజాశక్తి-మద్దిపాడు

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

గుండ్లకమ్మ ఎడమ కాలువకు విడుదల చేసిన నీరు కనీసం ఒక కిలోమీటర్ కూడా ప్రవహించలేదని, ఆ ఘనత వైసిపి ప్రభుత్వానికే చెందుతుందని టిడిపి మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు అన్నారు. మండల పరిధిలోని బూరేపల్లి గ్రామంలో మన ఊరు-మన తెలుగుదేశం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయంత్ బాబు మాట్లాడుతూ గుండ్లకమ్మ ఆయకట్టు రైతులు అధికార పార్టీ నాయకుల ఇసుక దాహానికి ఎండుముఖం పడుతున్నట్లు తెలిపారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. 15 రోజులు క్రితం ఎడమ కాలువలో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. అయితే కిలోమీటరు పొడవునా కూడా నీరు పారలేదని మండిపడ్డారు. రానున్న వేసవికాలంలో తాగునీరు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. అనంతరం గ్రామస్తులతో ఎన్నికలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు బోడపాటి రామకష్ణ, కొమ్మాలపాటి సుబ్బారావు, గ్రామ సర్పంచి రాయపాటి శేషయ్య, ఉపసర్పంచి శ్రీనివాస రావు, బుల్లెట్ శేషయ్య, నవీన్, తీమోతి, నాగరాజు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి తెనాలి వారి కోర్టులో
ఇ.పి. నెం. 135/2022
ఓ.యస్.నెం. 347/2017

బిట్వీన్:
పరుచూరి సుధాకరరావు .... డిహెచ్‌ఆర్ / వాది
వర్సెస్
ధూళిపాళ్ళ శ్రీనివాసరావు ... జెడిఆర్ / ప్రతివాది
జెడిఆర్ : ధూళిపాళ్ళ శ్రీనివాసరావు, తండ్రి : శివరామయ్య, వయస్సు 46 సం॥లు, హిందువు, వ్యాపారం, ఆర్/ఓ, అనంతవరం గ్రామం, కొల్లూరు మండలం, బాపట్ల జిల్లా.

పై నెంబరు దావాలోని ఇ.పి. నెం. 135/2022లో జెడిఆర్ అయిన మీకు అనేక పర్యాయములు శ్రీ కోర్టు ద్వారాను Order 21 Rule 37 CPC ప్రకారం నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు పంపవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది. 22-02-2024వ తేకి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గాన, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలయును. లేనియెడల పై నెంరు దావాలోని ఇపి.135/2022ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేదీ: 22-02-2024 ఇట్లు
తాడిబోయిన శ్రీనివాసరావు,
డిహెచ్ఆర్/వాది తరపు న్యాయవాది,
తెనాలి.

మహారాజ శ్రీ దర్శి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.పి.నెం :10/2022

రాగి వెంకటరెడ్డి ... పిటిషనర్
వర్సెస్
గాయం నారాయణరెడ్డి మరియు వగైరాలు .... రెస్పాండెంట్స్

టు
16వ రెస్పాండెంట్
అయిన వెన్నా శివశంకర్ రెడ్డి తండ్రి కాలిరెడ్డి, చింతగుంపల్లి గ్రామం & పోస్ట్, మార్కాపురం మండలం.
17వ రెస్పాండెంట్
అయిన విప్పర్ల రామకృష్ణ, తండ్రి రామయ్య, మాగుటూరు గ్రామం, అర్ధవీడు మండలం,
63వ రెస్పాండెంట్
అయిన ఏరువ సుబ్బారెడ్డి, తండ్రి పుల్లారెడ్డి కాకర్ల గ్రామం, అర్ధవీడు మండలం,
81వ రెస్పాండెంట్
అయిన పునుగోటి లక్ష్మీనారాయణ, తండ్రి వెంకట కొండయ్య, కొత్తపల్లి గ్రామం, కొనకనమిట్ల మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో మీరు 16,17,63,81వ రెస్పాండెంట్స్ అయి ఉన్నారు. కావున పై నెంబర్ కేసు తే : 23-02-2024దిన మీ నోటీసు కొరకు వాయిదా ఉన్నది. కావున పై నెంబరు కేసు యందు మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యడల తే: 23-02-2024దిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేక లాయర్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలాముగా మీకు తెలియజేయడ మైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
తేదీ : 08-02-2024
వాయిదా తేదీ : 23-02-2024

ఇట్లు
ఎస్.ఎం.బాషా,
పిటీషనర్ తరపు అడ్వకేట్
పొదిలి/దర్శి, ప్రకాశం జిల్లా,
ఫోన్ నెం: 9949435269.

పత్రికా ప్రకటన
కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం-బాపట్ల.

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం బాపట్ల జిల్లాలో ఇ -డిస్ట్రిక్ట్ మేనేజర్ మరియు ఇ-డివిజనల్ మేనేజర్ పోస్టులు భర్తీ చేయుటకు గాను నోటిఫికేషన్ జారీ చేయడ మైనది. కావున అర్హులు అయిన వారు కలెక్టరేట్ నందు ధరఖాస్తు చేసుకోవలసిందిగా కోరడమైనది.

గమనిక : నోటిఫికేషన్ మరియు దరఖాస్తును కలెక్టరేట్ నోటీసు బోర్డు నందు మరియు అన్ని రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల నందు ప్రచురించడమైనది.

కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం,
బాపట్ల.

PODILI NAGARA PANCHAYAT
e-procurement tender notice Rec, No.5/2024/E1-1, Dt : 08.02.2024
NIT.No.02/2022-23/PNP(2 call) (ONE Works).
General funds
Rs: 40.00 Lakhs
Starting date: 08.02.2024
Ending date: 13.02.2024
Further Details can be seen at "e-procurement Marketplace in www.apeprocurement gov.in officer inviting bids Commissioner Podili Nagara Panchayat-Prakasam (Dt), Andhra Pradesh.
Ph No:7660069901

Commissioner
Podili Nagara Panchayat

ప్రజాశక్తి
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024

'మెప్మా'లో కుంభకోణాన్ని నిగ్గుతేల్చండి

- వైసీపి నేతల ఉచ్చులో డ్వాక్రా మహిళలు
- న్యాయ సాయం చేసేందుకు టిడిపి సిద్ధం
- ప్రెస్‌మీట్‌లో తెలుగుదేశం నాయకుల వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మెప్మాలో జరిగిన రూ.100 కోట్ల కుంభకోణంపై 'సిట్' వేసి నిగ్గు తేల్చాలని తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. వైసీపి నేతల క్రిమినల్ ఉచ్చులో అమాయక డ్వాక్రా మహిళలు చిక్కుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో టిడిపి జిల్లా నాయకులు ఎద్దు శశికాంత్ భూషణ్ మాట్లాడారు. వైసిపి ద్వితీయ నేతల అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. భూకబ్జాలే కాకుండా ఏకంగా పొదుపు మహిళలను అడ్డుపెట్టుకొని రూ.కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. డ్వాక్రా రుణాల పేరుతో దొంగ గ్రూపులను ఏర్పాటు చేసి బ్యాంకులను మోసం చేసి సుమారు రూ.100 కోట్లపైగా నిధులను స్వాహా చేశారని దుయ్యబట్టారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని, నాలుగు బ్యాంకుల పరిధిలో రూ.12 కోట్ల మేర నిధులు పక్కదారి పట్టాయన్నారు. 43 బ్యాంకుల్లో ఇంకెంత నిధులు పక్కదారి పట్టాయో మేయర్ చెప్పకనే చెప్పారని ఎద్దేవా చేశారు. మేయర్ చెప్పినట్లు చూస్తే సుమారు రూ.120 కోట్ల మేర నిధులు గోల్ మాల్ అయ్యాయన్నారు. మెప్మాలో నిధులు కుంభకోణాన్ని నిగ్గు తేల్చాలంటే సిట్ వేయాల్సిందేనని డిమాండ్ చేశారు. సమగ్ర విచారణ చేసి అసలు దోషులను గుర్తించి చట్టపరంగా శిక్షించాలని కోరారు. మేయర్ గంగాడ సుజాత మొదటి నుండి క్రిమినల్ చరిత్ర కలిగి ఉన్నారని, 2008లోనే విదేశాల నుండి విరాళాలు సేకరణ దుర్వినియోగంపై కేసు నమోదు అయిందన్నారు. సిట్ విచారణలో దోషిగా తేల్చారన్నారు. తర్వాత ఇటీవల మండువారిపాలెం రైతుల భూములను ఏడు ఎకరాలు కాజేయాలని చూసి విఫలం చెందిన తంతంగాన్ని ప్రజలంతా చూశారన్నారు. మెప్మా ప్రభుత్వ అధికారులను తప్పించాలని చూస్తున్నారని, బ్యాంకు అధికారులు, ఆర్‌పిలతో నిధుల గోల్ మాల్‌లో పాత్ర దారులంటూ మేయర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మెప్మాలో జరిగిన నిధుల కుంభకోణంపై న్యాయవిచారణ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఒంగోలు పరిధిలో సుమారు 46 వేల మంది డ్వాక్రా మహిళలు బాధితులు మిగిలిపోయారన్నారు. వైసీపి నేతల క్రిమినల్ ఉచ్చులో చిక్కుకున్న మహిళలకు టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. న్యాయ సహాయం కోసం టిడిపి కార్యాలయానికి రావచ్చుని, బాధితులకు అండగా నిలిచేందుకు తాము సిద్దంగా ఉన్నామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బండారు మదన్, కార్పొరేటర్లు తిప్పరపల్లి రవితేజ, అంబూరి శ్రీనివాస్, గోగినేని రామారావు, కొల్లూరి చంద్ర పాల్గొన్నారు.

వృద్ధురాలు హత్య

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో వృద్ధురాలు హత్యకు గురైంది. అంబేద్కర్‌నగర్‌కు చెందిన తూమాటి చెన్నమ్మ(70) రాళ్లవాగు సమీపంలోని శ్మశానవాటికలో గాయాలతో మృతిచెంది కనిపించింది. బుధవారం బహిర్భూమికి వెళ్లిన ఆమె కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు అన్ని చోట్లా వెతికారు. కాగా గురువారం ఉదయం ఆమె గాయాలతో మృతి చెంది ఉండటంతో ఆమె కుమారుడు తూమాటి చెన్నకేశవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుదర్శన్ తెలిపారు. సంఘటనాస్థలాన్ని యర్రగొండపాలెం సిఐ రాములు నాయక్‌తో పాటు మార్కాపురం డిఎస్పీ వీరరాఘవరెడ్డి పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ పాల్గొని వివరాలు సేకరించారు.

బైక్‌లో పెట్టిన రూ.2 లక్షలు మాయం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

స్కూటర్ డిక్కీలో పెట్టిన నగదు నిమిషాల వ్యవధిలో మాయమవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి కథనం ప్రకారం స్థానిక నాగరాజుపల్లి రోడ్డులో వాసవీ కిరాణా షాప్ నిర్వహించే పోలిశెట్టి మాణిక్యరావు స్థానిక స్టేట్ బ్యాంకులో రూ. 2 లక్షలు నగదు డ్రా చేసాడు. అనంతరం ఆ నగదును తన స్కూటర్ డిక్కీ లో పెట్టాడు. మూత్ర విసర్జన చేయటం కోసం బ్యాంకు సమీపంలోనే బండిని నిలిపి ఉంచాడు. అనంతరం తిరిగి బండి వైపు చూడగా సీట్ జరిపి ఉండటాన్ని గమనించి డిక్కీలో పరిశీలించగా అందులో ఉన్న నగదు కవర్ కనిపించకపోవడంతో వెంటనే మార్టూరు అర్బన్ సీఐ రాజశేఖరరెడ్డికి ఫిర్యాదు చేశాడు. దొంగతనం జరిగిన తీరుని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు. .

నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

అంగన్‌వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలులోని కబాడిపాలెంలో గత 20 ఏళ్లుగా అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న పి.ప్రమీలాదేవి మృతిచెందారు. గురువారం తెల్లవారుజామున అనారోగ్యంతో చనిపోయారు. విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు అంగన్‌వాడీ కార్యకర్త ప్రమీలా దేవి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రమీలాదేవి అంగన్‌వాడీ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనేవారని, ఆమె మరణం ఉద్యమానికి తీరని లోటని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, నగర కార్యదర్శి టి.మహేష్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఒంగోలు అర్బన్ అధ్యక్షులు కెవి.సుబ్బమ్మ, సెక్టార్ సభ్యులు సిహెచ్ జ్యోతి, కె ఎమీమా, పి ప్రశాంతకుమారి, బుజ్జి ఉన్నారు.

బైక్‌ని ఢీకొన్న కారు..

- యువకుడు మృతి
- ఇద్దరికి తీవ్రగాయాలు
- బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద ఘటన



బైక్‌ను లాక్కొచ్చిన కారు

మృతిచెందిన నాగూర్‌వలీ

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. కారు ముందు భాగంలో బైక్ ఇరుక్కుపోయి కొద్ది దూరం ఈడ్చుకుపోవడం ప్రమాద తీవ్రతకు నిదర్శనం. మార్టూరు అర్బన్ సిఐ ఎస్వీ రాజశేఖరరెడ్డి కథనం ప్రకారం.. జె పంగులూరు మండలం రాంకురు గ్రామానికి చెందిన షేక్ నాగూర్‌వలీ(26), షేక్ నసీర్, తలపల హరీష్ ముగ్గురు స్నేహితులు. వీరంతా గురువారం ఒకే బైక్ పై టోల్ ప్లాజా నుండి మార్టూరు వైపు వెళుతున్నారు. అదే సమయంలో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం చిర్రవూరు గ్రామానికి చెందిన ఎన్ జయన్నారాయణ ఏపీ 40 ఏవై 9418 నంబర్ గల కారు లో గుంటూరు వైపు వెళుతూ ముందు వెళుతున్న బైక్‌ని అతివేగంగా వెనుక నుండి డీ కొట్టారు. ప్రమాద తీవ్రతకు ముగ్గురు యువకులు ఎగిరి రోడ్డుపై పడిపోయారు. వీరిలో నాగూర్‌వలి ఘటన స్థలంలోనే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నసీర్, హరీష్‌లను హైవే అంబులెన్సు లో ముందుగా మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు తరలించారు. నాగూర్‌వలీ మతదేహాన్నిపోస్ట్ మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మహమ్మద్ బాషా తెలిపారు.

విషాదంలో రాంకూరు

బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద రాంకూరు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఒక యువకుడు మతిచెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటం తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రమాదంలో మతి చెందిన నాగూర్ ఓ ప్రైవేట్ బ్యాంకు లో పనిచేస్తున్నాడు. తీవ్రంగా గాయపడిన నసీర్ ఓ ఎలెక్ట్రికల్ షాప్ లోను, మరో యువకుడు బెంగళూర్‌లోని ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో జాబ్ రావడంతో శుక్రవారం వెళ్లాల్సి ఉంది.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-కంభం రూరల్

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కంభం మండలం పరిధిలోని జంగంగుంట్ల గ్రామంలో గురువారం రెడ్డిబోయిన నాగరాజు అనే వ్యక్తి వద్ద 17 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎం బాలకృష్ణ, సబ్ ఇన్‌స్పెక్టర్ విఆర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకున్న అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-పెద్దారవీడు

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రకాశం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎఎస్‌పి బి.భవాని, శ్రీహర్ష గురువారం పట్టుకున్నారు. మండలంలోని సుంకేసుల గ్రామం నుంచి త్రిపురాంతకం వైపు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని దేవరాజుగట్టు గ్రామ సమీపంలో పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపి16టిడి 8533 వాహనంలో 54 పిడిఎస్ వివిధ రంగులు గల ప్లాస్టిక్ బ్యాగులను, మొత్తం 27 క్వింటాళ్ల రేషన్ బియాన్ని, వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్న వారిపై పెద్దారవీడు పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో సివిల్ సప్లయీస్ ఇడిటి ఎ తిరుపతిరెడ్డి, విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ సిఐ రాఘవరావు, ఎస్ఐ నాగేశ్వరరావు, ఎస్ఐ ఎ వెంగలరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పంటను దళారులకు అమ్మి మోసపోవద్దు

జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణ

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణ

ప్రజాశక్తి-పొదిలి

రైతులు పండించిన పంటను దళారుల చేతిలో పెట్టి మోసపోవద్దని జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణ అన్నారు. గురువారం మండలంలోని పాములపాడు గ్రామంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునే సమయంలో దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని తెలిపారు. జిల్లాలో ఎక్కువ కందిపంట సాగు చేస్తున్న ప్రాంతం పొదిలి మండలంలో మొదటిగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. త్వరలో జిల్లాలో అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ప్రారంభించడం జరుగుతుందన్నారు. నాణ్యమైన పంటను రైతులు ప్రభుత్వానికి అందించడం ద్వారా ప్రభుత్వం సరఫరా చేసే కేంద్రాలకు మంచి పుష్టికరమైన పప్పును ప్రజలకు ఆధించేందుకు వీలుం టుందన్నారు. సీడ్ టూ సేల్ ద్వారా కందులు కొనుగోలు చేసి వాటిని శుద్ధిచేసి సివిల్ సప్లై ద్వారా కందిపప్పును ప్రజలకు పం పిణీ చేయడంతో పాటు అంగన్వాడి, ప్రభుత్వం హాస్టళ్లకు అంద జేస్తామన్నారు. ప్రభుత్వ నిభంధనల ప్రకారం ఆరబెట్టుకొని రైతులు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. తేమశాతం 12శాతంగా, దెబ్బతిన్న గింజలు 2 శాతంగా, ఇతరపప్పు గింజలు 3 శాతంగా ఉండవచ్చున్నారు. అంతే కాకుండా నాణ్యమైన పంటను అమ్ముకునే సమయానికి బహిరంగమార్కెట్లో ఎంత ధర ఉంటే ఆ ధరను ప్రభుత్వం పరిగణిస్తుందని రైతులకు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.7500 అయినా ఈరోజు ప్రారంభసమయానికి బహిరంగ మార్కెట్ రూ.10285 ఉందని ఆధ ప్రకారం రైతులుకు చెల్లించడం జరుగుతుందన్నారు. కనుక దళారుల వద్దకు వెళ్లి నష్టపోకుండా కేంద్రాల్లోనే పంటను అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమం లో డీఎస్వో ఉదయభాస్కర్, సివిల్ సప్లయ్ డీఎం సత్యనారా యణ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు, సీఇవో పోలి శెట్టి రాజశేఖర్, ఏడీఏ బాలాజీ నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు వెంకటేశ్వర్లు, బీవీఎన్ శాస్త్రీ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను నిరసిస్తూ

ఆశావర్కర్ల రాస్తారోకో

ప్రజాశక్తి - రేపల్లె

సమస్యలను పరిష్కరించాలని అడిగిన ఆశావర్కర్ల అక్రమ అరెస్టులను నిరసిస్తూ స్థానిక బస్టాండ్ సెంటర్లో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఆశా వర్కర్ల మహిళలపై నిర్బంధాన్ని ప్రయోగించే ప్రభుత్వానికి ఇంటిదోవ తప్పదని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ హెచ్చరించారు. సిఐటియు ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లో నిన్నటి నుంచి జరుగుతున్న అక్రమ అరెస్టులను ఖండిస్తూ రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసనిస్తు, తమ న్యాయమైన సమస్యల పరిష్కారం చేయాలని రాస్తారోకో చేశారు. రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా మహిళలను రెండు రోజులు ముందుగానే వాళ్ల పనిప్రదేశాల దగ్గర నుండి, ఇళ్లవద్ద నుండి బలవంతంగా పోలీస్ స్టేషన్లకు తీసుకొచ్చి నిర్బంధించడాన్ని ఖండించారు. కనీస వేతనం, గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాల అమలు, మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 62ఏళ్ల రిటైర్మెంట్ జిఓని వర్తింపచెయాలని కోరారు. రిటైర్మెంటైన వారు, మరణించిన కుటుంబాల్లో అర్హులైన వారిని ఆశాలుగా తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చెయాలని అన్నారు. కోవిడ్ కాలంలో 2020మార్చి నుండి మరణించిన వారికి రూ.10లక్షల ఎక్స్ గ్రేషియో ఇవ్వాలని అన్నారు. ఖాళీ పోస్టులు భర్తీచేయాలని, నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని కోరారు. రాజకీయ జోక్యం తొలగించాలని అన్నారు. ఆశాలకు ఎఎన్ఎం ట్రైనింగ్ ఇవ్వాలని అన్నారు. ఎఎన్ఎం, జిఎన్ఎం ట్రైనింగ్ పొందిన ఆశా వర్కర్లకు ఎఎన్ఎం,హెల్త్ సెక్రటరీల, స్టాఫ్ నర్స్ నియామకాల్లో వెయిటేజిని ఇవ్వాలనే డిమాండ్స్‌తో ఆశావర్కర్స్ ఈరోజు ఛలో విజయవాడ పిలుపు ఇస్తే సమస్యలు పరిష్కారం చేయటం చేతకాని ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ వీరలక్ష్మి, ఎస్ దానమ్మ, దేవి, కరీమున్నీసా, గ్లోరీ, సిఐటియు నాయకులు కె ఆశీర్వాదం, డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

వేముల ఆరోగ్య కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి నాగార్జున

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. వేమూరులో నూతనంగా రూ.8.60కోట్లతో నిర్మించిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం భవనాలను, మండలంలోని సూర్యపల్లి, కోనేటిపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలు, విలేజి క్లినిక్‌లు, అద్దేపల్లి షాదీ ఖానా, నూతన హంగులతో ఏర్పాటు చేసిన మండల అభివృద్ధి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో అనేక మంది ఎంఎల్ఎలు, మంత్రులుగా పని చేసినప్పటికీ వైద్యశాల అభివృద్ధిని విస్మరించారని అన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి చొరవతో నేడు 30పడకల వైద్యశాలను నిర్మించటం గర్వకారణం అన్నారు. నూతన సచివాలయ భవనాలతో పాటు గ్రామ ఆరోగ్య కేంద్రాలు, రైతుబంధు కేంద్రాల వంటి అనేక రకాల అభివృద్ధి పనులను చేపట్టిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. 14ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసి దేశ రాజకీయాల్లో నేనే చక్రం తిప్పానని, అనేక మంది ప్రధాన మంత్రులను సైతం తన సారధ్యంలోనే నియమింపబడ్డారని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు నేడు ఢిల్లీకి వెళ్లి మరో పార్టీ నాయకుల కాళ్లు పట్టుకునే స్థితికి దిగజారాడని ఆరోపించారు. సినిమా యాక్టర్ పార్టీని పెట్టి ఇంకొక పార్టీలో విలీనం చేయటం, విలీనం గావించబడిన వ్యక్తేమో ఢిల్లీ వెళ్లి మరొక పార్టీ కాళ్లు పట్టుకోవడం రాష్ట్ర ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ జరగని విధంగా వైఎస్ఆర్ ప్రభుత్వ పాలనలో సంక్షేమం అందుతుందని అన్నారు. ప్రజలంతా మరో మారు జగన్మోహన్ రెడ్డిని సిఎంగా చూడాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. మంచి జరిగిందనిపిస్తేనే ఓటేయాలని అంటున్న జగన్ వ్యాఖ్యలు ఆలోచన కలిగిస్తుందని అన్నారు. మరెవరికైనా అలా అడిగే ధైర్యం ఉందాని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతకు 175స్థానాల్లో పోటీ చేసే ధైర్యం లేక వివిధ పార్టీలను కలుపుకుంటున్నాడని అన్నారు. తమ పార్టీ 175స్థానాల్లో పోటీ చేసి 175స్థానాలు గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలను నేరుగా లబ్దిదారులకు చేర్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనని అన్నారు. తెల్లవారక ముందే అవ్వా తాతలకు పెన్షన్ అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేసి మరో సారి వైసీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వేమూరు, భట్టిప్రోలు మండలాల వైసిపి కన్వీనర్లు బొల్లి ముంత ఏడుకొండలు, మోర్ల శ్రీనివాసరావు, ఎంపీపీలు ఎల్లమాటి మోహన్, డివి లలిత కుమారి, జడ్పిటిసిలు గాజుల హేమలత, టి ఉదయభాస్కరి, వేమూరు, భట్టిప్రోలు, సూరేపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు గాజుల భాను ప్రకాష్, గుమ్మడి సాంబశివరావు, గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు (చిన్న బుజ్జి), సర్పంచులు ద్వారా రవికిరణ్మయి, మొర్ల విజయలక్ష్మి, మోర్ల కోటేశ్వరమ్మ, డాక్టర్ హరిణి, నాయకులు మల్లేశ్వరరావు, బాలాజీ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రేపల్లె

మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కారం చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని స్థానిక చంద్రమోళి పార్కులో ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం గురువారం నిర్వహించారు. డి ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇంజనీరింగ్ కార్మికులు ఎదుర్కొటున్న సమస్యలపై చర్చించారు. సమావేశంలో యూనియన్ (సీఐటీయు) ప్రధాన కార్యదర్శి ఎం రవి బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికులు అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం సరైన వేతనాలు అమలు చేయకపోవటం వల్ల నష్టపోతున్నట్లు చెప్పారు. తమ సమస్యలు పరిష్కారం కొరకు ప్రభుత్వ అధ్యయన కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీ దృష్టికి ఇంజనీరింగ్ కార్మికుల సర్వీస్, ఇప్పుడు ఇస్తున్న వేతనాలు, ఇతర సమస్యలు తెలియచేస్తున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులకు రూ.21,500 వేతనం చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధ్యయన కమిటీ ప్రభుత్వానికీ సిపార్సు చేయాలని కోరారు. కంప్యూటర్ ఆపరేటర్లు, పార్కుల్లో పనిచేసే వాళ్ళకి, మేస్త్రిలు, విద్యుత్తు, మంచినీళ్ల విభాగంలో పనిచేస్తున్న స్కిల్డ్ వర్కర్లందరికీ స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని కోరారు. ఇంజనీరింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. చిన్న చిన్న కారణాలతో ఉద్యోగాల్లోంచి తొలగిస్తామని రాష్ట్రంలో కొన్నిచోట్ల ఒత్తిడిచేయటం వల్ల నిరంతరం భయాందోళనలో ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, కోశాధికారి కె రాఘవేం ద్రరావు, బి యువ రాజు, వి శ్రీనివాసరావు, ఎ సుబ్బారావు పాల్గొన్నారు.

సమావేశంలో యూనియన్ కార్యదర్శి ఎం రవిబాబు

పాలిటెక్నిక్ కళాశాల సందర్శనలో విద్యార్థులు

క్షేత్రస్థాయి ప్రదర్శనతోనే విజ్ఞానం

ప్రజాశక్తి -రేపల్లె

పారిశ్రామిక కర్మగారాల పరిశీలనతోనే విద్యార్థులకు విజ్ఞానం లభిస్తుందని పేటేరు జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం చెరుకూరి బాపూజీ అన్నారు. పాఠశాలకు చెందిన వృత్తివిద్యా కోర్సుల విద్యార్థులను క్షేత్ర స్థాయి ప్రదర్శనకు దివిసీమ పాలిటెక్నిక్ కళాశాలకు గురువారం తీసుకు వెళ్లారు. కళాశాల్లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగం, కంప్యూటర్ సైన్స్, లాబ్, ఇంజనీరింగ్ లాబరేటరీస్ వని తీరును విద్యార్థులకు వివరించామని తెలిపారు. ఇలాటి ప్రదర్శన పరిశీలనలు విద్యార్థుల్లో వైజ్ఞానిక నైపుణ్యత పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్యా నిపుణులు మహమ్మద్ రౌఫని, పావని, విద్యార్థులు పాల్గొన్నారు.

యాత్ర2 సినిమా వీక్షిస్తున్న కరణం వెంకటేష్

యాత్ర-2 సినిమా వీక్షణం

ప్రజాశక్తి - చీరాల

వర్తమాన రాజకీయ పరిస్థితులపై దర్శకుడు మహి వి రాఘవ అధికార, ప్రతిపక్ష పార్టీల స్థితిగతులపై తెరకెక్కించిన యాత్ర2 సినిమా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైంది. స్థానిక శాంతి థియేటర్లో విడుదలైన యాత్ర2 సినిమాను వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు వైసిపి నాయకులతో కలిసి వీక్షించారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం ఆనాడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు సీఎం జగన్ మోహన్ రెడ్డి పాత్రలను అద్భుతంగా చూపించాడని అన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు సినిమాను వీక్షించి వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి, పలువురు కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ర్యాలీ

ప్రజాశక్తి - బాపట్ల

రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్టిసి మేనేజర్ టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని చీలు రోడ్డు సెంటర్లో మహాత్మా పూలే విగ్రహం వద్ద ఆర్టీసీ సిబ్బంది నినాదాలు చేశారు.

ఆర్టీసీ సిబ్బంది ర్యాలీ

పిఎసిఎస్ చైర్ పర్సన్‌గా జాగర్లమూడి వెంకటరత్నమ్మ

వెంకటరత్నమ్మ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని జాగర్లమూడి వారిపాలెం పిఎసిఎస్ నూతన చైర్ పర్సన్‌గా జాగర్లమూడి వారిపాలెం గ్రామానికి చెందిన జాగర్లమూడి వెంకటరత్నమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత జనవరి 31తో పాత పాలక వర్గానికి గడువు ముగియడంతో కొత్త పాలకవర్గంను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చైర్ పర్సన్ వెంకటరత్నమ్మతో పాటు సభ్యులుగా పూసల హనుమంతరావు, బండి ఓబుల్‌రెడ్డిని నియమించారు. వీరికి వైసిపి ఇన్చార్జి పానెం చిన హనీమి రెడ్డి సోదరుడు నరసింహారెడ్డి, వైసిపి మండల ఇంచార్జ్ శ్రీనివాసరెడ్డి ముప్పవరంలోని సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, సొసైటీ మాజీ అధ్యక్షులు జాగర్లమూడి ఎల్లమందరావు, ముప్పవరం సర్పంచ్ రౌతు సాంబశివ రావు, ఎంపీటీసీ పూసల గంగాధర్, వైసిపి రైతు సంఘం మండల అధ్యక్షులు తోట రామాంజనేయులు, ముచ్చు శ్రీను పాల్గొన్నారు.

తహశీల్దారు వై నాగరాజును అభినందిస్తున్న సిబ్బంది, డిటి

తహశీల్దారు భాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - యద్దనపూడి

నూతన తహశీల్దారుగా వై నాగరాజు గురువారం భాధ్యతలు తీసుకున్నారు. ఆయన నెలురు జిల్లా సంగం మండలంలో పని చేస్తూ ఎన్నికల బదిలిపై ఇక్కడకు వచ్చారు. విధుల్లో చేరిన ఆయనను డిటి విష్ణు ప్రసాద్, తెలంగాతోటి భాస్కరరావు, విఆర్‌ఒలు సత్యనారాయణ, శేషుబాబు, వలి, వసంతరావు అభినందించారు.

అచ్చేన్నాయుడుకు బయోడేటా అందజేస్తున్న చంద్రమౌళి

అచ్చెన్నాయుడిని కలిసిన చంద్రమౌళి

ప్రజాశక్తి - చీరాల

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చెన్నాయుడు పిలుపు మేరకు చీరాల మాజీ జెడ్పిటిసి గుద్దంటి చంద్రమౌళి టిడిపి జాతీయ కార్యాలయంలో గురువారం చీరాల రాజకీయ పరిస్థితులపై చర్చించారు. చీరాల ప్రాంతంలో తనకు అందరూ సూపరిచితులని అన్నారు. రానున్న ఎన్నికల్లో చీరాల నియోజకవర్గం శాసన సభ అభ్యర్థిత్వం కోరుతు ధరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయాడు సానుకూలంగా స్పందించి అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి హామీ ఇచ్చినట్లు చంద్రమౌళి తెలిపారు. అత్యధిక ఓటర్లు చేనేతలే ఉన్నట్లు తెలిపారు. గతంలో తాను జెడ్‌పిటిసిగా పనిచేసిన అనుభవం, పార్టీ ప్రారంభం నుండి తాను టిడిపిలోనే కొనసాగుతున్నట్లు తెలిపారు. గత అనేక ఎన్నికల్లో పార్టీ ప్రతిపాదించిన పార్టీ అభ్యర్థుల విజయానికి తాను కృషి చేసినట్లు తెలిపారు. పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న తనకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట టిడిపి నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు, అందే ఉమామహేశ్వరరావు, అవ్వారు సాంబయ్య, పద్మశాలి సాధికార సమితి కన్వీనర్ యర్రాకుల ప్రసాద్, విన్నకోట జగదీష్, టిడిపి మండలం బిసి సెల్ ఉపాధ్యక్షులు సయ్యద్ ముతహర్, సాధు లక్ష్మయ్య, గుర్రం తిరుమలేశ్వరరావు, కొప్పు రంగారావు, సూరగని చెన్నకేశవులు ఉన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తూ ..

ఆశా వర్కర్ల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఆశావర్కర్లపై నిర్బంధాన్ని నిరసిస్తూ ఎపి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాను అధికారంలోకి వస్తే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చాక సమస్యలు వినేందుకు కూడా చొరవచూపకపోవడాన్ని యూనియన్ నాయకులు ఖండించారు. ఈ కార్యక్రమంలో

ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

పామూరులో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

ఆశావర్కర్ల యూనియన్ నాయకులు, సిఐటియు నగర నగర కార్యదర్శి టి.మహేష్, తంబి శ్రీనివాసులు, ఎస్‌డి.హుస్సేన్, ఐద్వా నాయకులు కంకణాల రామదేవి, శ్రామిక మహిళా నాయకులు పి. పికల్పన పాల్గొన్నారు. ఆశావర్కర్ల నిరసనకు మధ్యాహ్నభోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గురునాధం, మహేష్, ఆర్‌పి యూనియన్ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు రాహేలమ్మ, రాజ్యలక్ష్మి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మద్దతు తెలిపారు.

మార్కాపురం : సమస్యల పరిష్కారం కోసం ఆశా వర్కర్లు చలో విజయవాడ కు పిలుపు నిచ్చారు. దీంతో చలో విజయవాడకు వెళ్ల పోలీసులు అడ్డుకున్నారు. అర్ధరాత్రి

త్రిపురాంతకం పోలీసు వద్ద నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

సమయంలో ఆశా వర్కర్లు, సిఐటియు నాయకులను అక్రమంగా అరెస్టు చేశారు. అరెస్టులను నిరసిస్తూ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం.రఫి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ఆశాలను కార్మికులుగా గుర్తించాలన్నారు. వారిపై పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పి.రూబెన్, డి. సోమయ్య, జె.నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా బాలనాగయ్య, ఎఐటియుసి నాయకుడు అందే నారసయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మరియమ్మ, కమలమ్మ, మహాలక్ష్మి, పద్మ, గీత, వెంకటరమణ, జ్యోతి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్ : ఆశా వర్కర్లు చలో విజయవాడకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు ఆవులయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు జి. విశ్రాంతమ్మ, సరోజ మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని గత నాలుగు సంవత్స రాలుగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రాధేయ పడుతున్నా పట్టించు కోలేదన్నారు. సమస్యలు పరిష్కరించక పోక అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం అన్యాయమన్నారు.

త్రిపురాంతకం : చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆశా వర్కర్లను త్రిపురాంతకం పోలీసులు అరెస్టు చేశారు. మెడపి టోల్‌గేట్ వద్ద బస్సులు తనిఖీ చేసి నంద్యాల నుంచి విజయవాడ వెళ్తున్న 15 మంది ఆశాలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం త్రిపురాంతకం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం నుంచి చలో విజయవాడకు వెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

పామూరు : ఆశా వర్కర్లపై ఉక్కుపాదం మోపడం దుర్మార్గమైన చర్య అని సిఐటియు జిల్లా కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి తెలిపారు.ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ తలపెట్టిన ఆశా వర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదం మోపడం దుర్మార్గమైన చర్య అన్నారు.ఈ కార్యక్రమంలో షేక్ అల్లాభక్షు, గౌస్ బాషా రజియా,సావిత్రి. నారాణమ్మ తదితరులు పాల్గొన్నారు

మద్దిపాడు : చలో విజయవాడకు వెళ్లకుండా ఆశా వర్కర్లను అడ్డుకొని పోలీసు స్టేషన్‌కు తరలించడాన్ని ఖండిస్తూ సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఉబ్బాఆదిలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, సిఐటియు నాయకులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు : పోలీసులు చలో విజయవాడ వెళ్లకుండా అడ్డుకొని ఆశా కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు

హనుమంతునిపాడులో నిరసన తెలుపుతున్న ఆశాలు

ఉస్తేలా లక్ష్మీదేవి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు చేత ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీస వేతనాలు ఇవ్వటం లేదన్నారు. సంబంధంలేని పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఆశా కార్యకర్తలపై వేధింపులు, రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఎక్కువయ్యాయన్నారు. పని భారం, ఒత్తిళ్లతో మానసిక వేదనకు గురవుతున్నట్లు తెలిపారు. ఆశా కార్యకర్తలకు ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఆశా వర్కర్లకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మిగిలాయని విమర్శించారు. అక్రమంగా అరెస్టు చేసిన ఆశా కార్యకర్తలు, నాయకులను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సభ్యులు చాముండేశ్వరి, బాల చెన్నమ్మ, లక్ష్మమ్మ, రూతమ్మ, ఎలిజిబెత్ రాణి, రజిని పాల్గొన్నారు.

మద్దిపాడులో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

ఒంగోలులో చీకటి శ్రీనివాసరావు హౌస్ అరెస్టు

పొదిలిలో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

మార్కాపురంలో పోలీసు స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

తహశీల్దారు బదిలీపై చర్చ

ప్రజాశక్తి- సిఎస్ పురం రూరల్

బాధ్యతలు చేపట్టిన రెండు రోజులకే తహశీల్దారు బదిలీ కావడం మండలంలో చర్చానీయాంశంగా మారింది. ఎన్నికల బదిలీల్లో భాగంగా నెల్లూరు జిల్లా సీతారాంపురం తహశీల్దారు సుధాకర్ రావు గత సోమవారం ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. మరుసటి రోజే ఆయన్ని పొన్నలూరు మండలానికి బదిలీ చేశారు. షేక్ నాగుల్ మీరాను ఇక్కడే తహశీల్దారుగా కొనసాగించేలా అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. దీనిపై మండలంలో చర్చ సాగుతోంది. ఎన్నికల నిబంధనల ప్రకారం ఒక జిల్లాలో మూడు సంవత్సరాలు విధులు పూర్తి చేసుకున్న అధికారిని, మరో జిల్లాకు బదిలీ చేయాల్సి ఉంది. మూడు సంవత్సరాలు పూర్తి కాకుంటే జిల్లాలోని మరో మండలానికి బదిలీ చేయాల్సి ఉంది.అయితే అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో తహశీల్దారు నాగుల్ మీరాను బదిలీ చేయలేదని చర్చించుకుంటున్నారు.ఓ అధికారికి జాయినింగ్ ఉత్తర్వులు ఇచ్చి, ఆ అధికారి విధుల్లో చేరిన మరుసటి రోజే బదిలీ చేసిన అధికారుల తీరును ప్రజలు విమర్శిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల ప్రయోజనం కోసమే తహశీల్దారును మార్చలేదంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మారం వెంకారెడ్డి

11న చెస్ పోటీలు

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక లిటిల్‌స్టార్ పబ్లిక్ స్కూలులో ఎపి చెస్ అకాడమీ ఒంగోలు వారి ఆధ్వర్యంలో ఈనెల 11న చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ ప్రతినిధులు తెలిపారు. లిటిల్‌స్టార్ పాఠశాలలో చెస్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను వైసిపి అద్దంకి నియోజకవర్గ పరిశీలకులు మారం వెంకారెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు, అకాడమీ ప్రతినిధి ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యులు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ చైతన్య కష్ణ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహిస్తున్న నేషనల్ డి వార్మింగ్ డే కార్యక్రమంపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల ప్రాధానోపాధ్యాయులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీధర్ మాట్లాడుతూ 1నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ నులిపురుగుల వ్యాధి నివారణకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సయ్యద్ అక్బర్ బాషా మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పోషకాహార లోపం, రక్తహీనత, అలసట వచ్చే ప్రమాదం ఉందన్నారు. జాతీయ నులిపురుగుల వ్యాధి నివారణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోఎంఇఒలు శ్రీమన్నారాయణ, ఆవుల శ్రీనివాసరావు, డాక్టర్ లీనా రేఫెల్, ఆరోగ్య పరిరక్షకుడు సయ్యద్ మసూద్ అలీ, యూనిట్ అధికారి భాస్కర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ లేగ దూడల అభివృద్ధిపై అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె

పశువుల కృత్రిమ గర్భధారణపై పశుపోషకులు అవగాహన కలిగి ఉండాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని పేటేరు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేసి జాతీయ కృత్రిమ గర్భధారణ, లేగ దూడల ప్రదర్శనలో ఆయన మాట్లాడుతూ అంతరించి పోతున్న పశుసంపదను పరిరక్షించేందుకు ప్రభుత్వం వివిధ రకాల చర్యలు చేపట్టిందని చెప్పారు. కృత్రిమ గర్భం ద్వారా పుట్టిన లేగ దూడలను ప్రోత్సహించటానికి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా నూటికి తొంబై శాతం ఆడ దూడలు పుట్టే అవకాశం ఉందని అన్నారు. జాతీయ ఉచిత కృత్రిమ గర్భధారణ 4వ విడత జరుగుతున్న నేపథ్యంలో ఏప్రిల్ నుండి జులై 31

రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హనుమంతరావు

వరకు పశువులకు కృత్రిమ గర్భధారణ ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. పశు జాతిని సక్రమంగా అభివృద్ధి చేసేందుకు సీమన్ ఇంజక్షన్ రెండు దఫాలుగా ఇవ్వటం ఒక పద్ధతి అన్నారు. ఆవుల్లో ఒంగోలు జాతి, గిరి జాతి, పుంగనూరు జాతి పిండాలు ప్రవేశ పెట్టటం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా పశు జాతిని త్వరితి గతిన అభివృద్ధి చెయ్యటం సాధ్యం అవుతుందని అన్నారు. వీటితోపాటు పశు పోషకులు, రైతులకు ప్రభుత్వ పథకాల ద్వారా గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి సబ్సిడైపై రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. అంతరించి పోతున్న దేశీయ గో జాతిని సంరక్షించేందుకు జిల్లాలోని అద్దంకి, రేపల్లె మండలాల్లో రూ.30లక్షలతో 2సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో రూ.15లక్షల సబ్సిడీ ఉంటుందని అన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుడు తన వాటా క్రింద రూ.6లక్షలు చెల్లించాలని తెలిపారు. ఈ పథకం కింద 20ఆవులు, ఒక కోడె దూడను ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ నరేంద్ర, పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ కనపర్తి రవికిరణ్ పాల్గొన్నారు.

తాసిల్దార్ పద్మావతికి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

తహశీల్దార్‌గా పద్మావతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నూతన తహశీల్దారుగా సిహెచ్ పద్మావతి గురువారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా నుండి బదిలీపై వచ్చిన ఆమెకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కాగా నాలుగు రోజుల క్రితం తహశీల్దారుగా బాధ్యతలు తీసుకున్న సుభద్ర బల్లికురవకు బదలీ కావడం తీవ్ర చర్చినియంశం అయ్యింది. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా అధికారుల బదలీలు సాధారణమే అయినప్పటికీ బాధ్యతలు తీసుకున్న మూడు రోజులకే బదిలీ కావటం అధికారుల్లో చర్చ కొనసాగుతుంది.

పుస్తకవిష్కరణ చేస్తున్న ఎంఈఓ దేవరాజ్

రాజ్యాంగ ప్రవేశిక పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎస్ఎఫ్ఐ, అద్దేపల్లి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రాథమికోన్నత పాఠశాల్లో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రూపొందించిన బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని ఎంఇఒ నీలం దేవరాజ్ గురువారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు రూపొందించిన ఈ పుస్తకం విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. రాజ్యాంగం ప్రకారం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని అన్నారు. వాటి అమలుకు కృషి చేయాలన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి వ్యక్తికి ఉచితంగా విద్యను పొందే అవకాశం ఉందని అన్నారు. దానికి అనుగుణంగా ప్రభుత్వాలు ఉచిత విద్యను అందిస్తున్నాయని అన్నారు.

డాక్టరేట్ పొందిన ఆంతోనీరాజ్‌కు వనమ అభినందనలు

ఆంటోనిరాజ్‌కు పిహెచ్‌డి

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీ ఇఇఇ విభాగ అధ్యాపకుడు ఎస్ ఆంతోని రాజ్ పిహెచ్‌డి డిగ్రి పొందినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. తమ కళాశాల అధ్యాపకులు డాక్టరేట్ పొందడంపట్ల అభినందనలు తెలిపారు. అత్యధిక మంది అధ్యాపకులు డాక్టరేట్ పొందినవాళ్లే ఉన్నట్లు తెలిపారు. ట్రిపుల్ ఇ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకులు ఎస్ ఆంతోని రాజ్ అన్నా విశ్వ విద్యాలయం నుండి పిహెచ్‌డి డిగ్రిని పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు తెలిపారు. ఎ మాగ్జిమం పవర్ హార్వెస్టింగ్ ఫర్ పోటో ఒల్టాయిక్ సిస్టమ్ అండర్ పేస్టల్ షేడింగ్ కండీషన్స్ యూజింగ్ ఎఐ టెక్నిక్స్ అనే అంశం పరిశోధన గావించి పిహెచ్‌డి డిగ్రిని సాధించినట్లు తెలిపారు. చెన్నై అన్నా విశ్వ విద్యాలయంకు చెందిన జి గిఫ్టున్ శామ్యుయేల్ ఆధ్వర్యంలో పరిశోధన గావించినట్లు హెచ్ఒడి ఎస్‌విడి అనిల్ కుమార్ తెలిపారు.

14 న యానాదుల శంఖారావం

ప్రజాశక్తి - కర్లపాలెం

ఈ నెల 14 తేదీన స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో యానాదుల రాష్ట్ర మహాసభ జరుగనున్నదని యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షులు బాపట్ల వెంకటపతి అన్నారు. స్థానిక వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76ఏల్లు అయినప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని అన్నారు. నేటికి యానాదులకు రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు లేవంటే అధికారులు, ప్రజాప్రతినిధుల అసమర్ధత అర్ధం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో యానాది సంఘాల మహా కూటమి చీఫ్ అడ్వైజర్ ఈగ శ్రీనివాసరావు,

కరపత్రం ఆవిష్కరించిన రాష్ట్ర అధ్యక్షులు బాపట్ల వెంకటపతి

అధికార ప్రతినిధి యాకశిరి నరసింహారావు, కోశాధికారి బెల్లంచర్ల ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, తుమ్మా కొండలు, గోసాని తిరుపతమ్మ, గోసాని రాంబాబు, జి అరుణ, జీవన్ బాబు, కోనేటి సుందరమ్మ, తలపల జీవన్ బాబు పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న ఆశా వర్కర్లు

ఆశా వర్కర్ల రాస్తారోకో

జిబిసి రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్

ప్రజాశక్తి - బాపట్ల

ఆశాలు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లనియకుండా అడ్డుకొని పోలీస్ స్టేషన్లో నిర్భందించడంతో గురువారం ఆశా కార్యకర్తలు బాపట్లలో రాస్తారోకో చేశారు. ఆశా వర్కర్లను గృహ నిర్బంధం చేసి విజయవాడకు వెళ్ళనీయకుండా పలువురు ఆశా కార్యకర్తలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆశాలు పోలీస్ స్టేషన్లో నిర్భందించిన ఆశాలను విడుదల చేయాలని కోరుతూ పట్టణంలో రాస్తారోకో చేశారు. జిబిసి రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగిందని సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆశాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విజయవాడ వెళ్ళబోమని వారి వద్ద నుండి లిఖితపూర్వక హామీ తీసుకొని సాయంత్రం వచ్చి సంతకాలు పెట్టి వెళ్ళాలనే షరతుపై ఆశావర్కర్లను విడుదల చేశారు.

నేడు నులిపురుగుల నివారణ దినోత్సవం

బాపట్లలో నులిపురుగుల నివారణ ర్యాలీ

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో ప్రభుత్వ శాఖల అధికారులు బాధ్యతగా జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఎం అండ్ హెచ్ఒ ఎస్ విజయమ్మ అన్నారు. ఈనెల 9న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వైద్య విద్య మహిళా శిశు సంక్షేమ శాఖలు నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా చిన్నారులకు, కిషోర బాలల కడుపులో నులి పురుగులు నిర్మూలించడానికి ఉచితంగా ఆల్బెండజోల్ 400మిల్లీ గ్రాముల చప్పరించే మాత్రలను విద్యార్థులకు ఉచితంగా అందజేసేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. నులిపురుగుల నిర్వహణకు తీసుకోవలసిన జాగ్రత్తలపట్ల అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి వెంకటేశ్వరరావు, సిడిపిఓ శైలజ, ఎం సౌజన్య, బిసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్లు కె కుమారి, పి త్రివేణి, జి జ్యోతి, ఎన్ పద్మావతి, కె శేషు కుమారి, కె జోసెఫ్ జాన్, సుందర్ సౌజన్య, కె శేషుకుమారి, ఎం నాగమల్లేశ్వరి, వి రాధా, ఎ అరుణకుమారి పాల్గొన్నారు.

పంగులూరు : ఈనెల 9నుండి మండలంలో జరిగే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ కె మ్యాత్యూ బాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నులి పురుగుల నివారణ కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 14సచివాలయాల్లో గల 21పంచాయతీల్లో నులిపురు గుల నివారణ కార్యక్రమం శుక్రవారం నుండి ప్రారంభిం చాలని అన్నారు. స్కూల్ విద్యార్థులు, అంగన్‌వాడి పిల్లలు అందరూ హాజరు కావాలని కోరారు. ఒకవేళ 9న స్కూలుకు హాజరుకాని పక్షంలో 16న ట్యాబ్లెట్లు ఇస్తామని చెప్పారు. ఆల్బెండజోల్ టాబ్లెట్లను మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత వేసుకోవాలని పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శివ చెన్నయ్య తెలిపారు. పిల్లల్లో ఉండే నులిపురుగుల నిర్మూలన చేయడం ద్వారా రక్తహీనత నుండి కాపాడ వచ్చని అన్నారు. పిల్లలు అందరికీ మాత్రలు వేయాలని ఎంఇఒ కె నాగభూషణం కోరారు. కార్యక్రమంలో డాక్టర్ బాల రాజేశ్వరి, సూపర్వైజర్లు మదర్ షా, హరిబాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అనురాధ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : నులిపురుగుల నిర్మూలన దినోత్సవంపై వైద్య సిబ్బంది ఆయా అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని ఐలవరం ఎస్సీ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది చిన్నారులకు పరిశుభ్రతపై వివరించారు. నులిపురుగుల ఉండటం వలన చిన్నారులకు శారీరకంగా మానసిక అనేక వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రభుత్వం నులిపురుగులు నిర్మూలించేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఏడాది నుండి ఈ రెండేళ్లలోపు పిల్లలకు బిళ్ళలు సగభాగాన్ని, 3 నుండి 19ఏళ్లలోపు వారికి ఒక బిళ్ళను అందిస్తే నిలి పురుగులు నిర్మూలన జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జ్యోతి, మహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త రత్నకుమారి పాల్గొన్నారు.

పంగులూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

చిన్నారులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న ఇన్‌చార్జి ఆమంచి

ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

స్థానిక పంచాయతీ ఆవరణలో వరుసగా 4వ విడత వైఎస్ఆర్ ఆసరా పథకం లబ్ధిదారులైన డ్వాక్రా మహిళలకు చెక్కులను వైసిపి ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ గురువారం పంపిణీ చేశారు. అనంతరం వైసిపి నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలతో కలిసి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు అన్నీ మహిళల పేర్లతో అమలు చేస్తూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మహిలా పక్షపాతిగా నిలిచారని అన్నారు. రాష్ట్ర ఆర్ధిక పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ అవ్వా, తాతల పెన్షన్ ఒకటో తేదీన ఉదయమే ఇచ్చినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకున్న జగన్‌ను మరోసారి సిఎం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బండారు అనూష రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ తూమాటి చలమయ్య, వైసిపి మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, పావులూరు సర్పంచ్ లూధియమ్మ, గంగవరం సర్పంచ్ బెల్లం సుధాకర్, పూర్ణ, అడప సుధాకరరెడ్డి, అమ్మిశెట్టి శీను, బాబుల్లా, ఉస్మాన్, షమీం, మాలిక్, వెంకటరెడ్డి, ఆదిరెడ్డి, చిగురుపాటి శ్రీను, సునీల్ పాల్గొన్నారు.

బడ్జెట్ పట్ల జగన్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం

ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆరోపణ

ప్రజాశక్తి - అద్దంకి

జగన్‌రెడ్డి సర్కార్ అసెంబ్లీ, కౌన్సిల్లో బడ్జెట్ ప్రవేశపెట్టిందని, బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు సభలో చెప్పిన సూక్తుల్లో ఎన్నిపాటిస్తున్నాడో గుండెలపై చేయి వేసుకొని ముఖ్యమంత్రే ఆలోచించుకోవాలని ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అన్నిరంగాల్లో రాష్ట్రం పురోగమిస్తోందని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. వ్యవసాయ రంగం మేలుకోసం, రైతాంగం సంతోషం కోసం ఏం చేయబోతున్నారో బడ్జెట్లో ప్రభుత్వం పేర్కొనకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బుగ్గన బడ్జెట్ అంచనాలు కొండంత, ఖర్చులు పీసరంత ఉన్నట్లు తెలిపారు. రూ.13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44వేల కోట్లకు, రూ.35వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనని అన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్లో కొత్త అంశాలు ఏమీ లేవని అన్నారు.



టిడిపి కార్యకర్తకు నివాళి అర్పిస్తున్న గొట్టిపాటి రవికుమార్

ప్రస్తుతం ఏపీ అప్పులు రూ.11.58లక్షల కోట్లకు చేరిందని అన్నారు. మద్యం బాండ్లపై రూ.16వేల కోట్లు, కార్పొరేషన్ హామీలతో రూ.1,10,603కోట్లు తెచ్చారని అన్నారు. వైసిపి హయాంలో రెట్టింపైన ఏపీ అప్పులు 2019లో టీడీపీ తీసుకున్న దానికంటే 4రెట్ల అప్పు తెచ్చారని అన్నారు. వైసీపీ తీసుకొచ్చిన ప్రతీ స్కీము ఓ స్కామ్ గా మారిందని అన్నారు. వైసీపీ హయాంలో ధరలు, పన్నులు మోతమోగిస్తున్నాయని అన్నారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలు భారీగా పెంచిందని అన్నారు. విద్యుత్ ఛార్జీలను 8 సార్లు వడ్డనలో ఎక్కడా రాజీపడని జగన్ పేదలపై బాదుడే బాదుడు దిగ్విజయంగా కొనసాగిస్తూ పిప్పి చేస్తున్నాడని అన్నారు. వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం నిజంగా బలోపేతం చేస్తే, ఆహార ధాన్యాలు, అపరాల సాగు విస్తీర్ణంలో దేశంలో రాష్ట్రం ఎందుకు వెనుకంజలో ఉందిని ప్రశ్నించారు. సాగు విస్తీర్ణం ఎందుకు తగ్గిపోయిందో చెప్పాలని అన్నారు. రైతు ఆత్మహత్యల్లో ముందు వరసలో ఎందుకు ఉందో జగన్‌రెడ్డి నోరు విప్పాలని అన్నారు. గతంలో విశాఖపట్నానికి ఒక విమానాశ్రయం ఉంటే, భోగాపురంలో మరో విమానాశ్రయం ఎందుకు అన్న వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యాక భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులు ప్రారంభించి గొప్పలు చెప్పుకున్నాడని అన్నారు. చంద్రబాబు హయాంలో ప్రారంభించిన అనేక ప్రాజెక్టుల్ని జగన్‌రెడ్డి మరలా ప్రారంభించాడే తప్ప కొత్తగా తాను తీసుకొచ్చింది ఏమీ లేవని ధ్వజమెత్తారు.

రోడ్డు బద్రత అవగాహన ర్యాలీ చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - అద్దంకి

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పక నిబంధనలు పాటించాలని డిపో అసిస్టెంట్ మేనేజర్ మెహబూబీ అన్నారు. రోడ్డు భద్రత ఉత్సవాల సందర్భంగా ఆర్టీసీ డిపో నుండి బంగ్లా రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఎపిఎస్ఆర్‌టిసి పిలుపు మేరకు రోడ్డు భద్రత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15జనవరి నుండి 14ఫిబ్రవరి వరకు జరుగుతాయని అన్నారు. ప్రయాణికులు బస్సు ఎక్కిన సమయంలో సమయపాలన పాటించి ముందుగానే స్టేజి వద్దకు రావాలని కోరారు. బస్సు డ్రైవర్లు బస్సు నడిపే సమయంలో జాగ్రత్తలు తీసుకొని సాధారణ వేగంతో వెళ్లాలని కోరారు. కొందరు బస్సు ఎక్కే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడుతూ బస్సు ఎక్కడం, అడ్డంగా రోడ్డు దాటడం అనేది మంచిది కాదని అన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే గమ్యస్థానానికి సులభంగా చేరుకోవచ్చని అన్నారు.

మత్స్య శాఖ కార్యాలయానికి తాళాలు

పట్టించుకోని ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - వేటపాలెం

మండల పరిషత్ ప్రాంగణంలో ఉన్న మత్స్యశాఖ ఏడి కార్యాలయం వారం రోజుల నుండి తలుపు తెరుచుకోవడం లేదు. ఎంతో ఆర్భాటంగా నిర్మాణం చేపట్టి నెలలో ఎవరి పరిధిలోని కార్యాలయాన్ని మూత వేయటం పట్ల మత్స్యకారులు విమర్శలు గుప్పిస్తున్నారు. దీని గురించి ఫిషరీస్ జిల్లా అధికారుల వివరణ అడిగిందుకు ప్రయత్నిస్తే అధికారులు ఫోన్లు చేయకపోవడం గమనర్హం. ఎట్టకేలకు మత్స్య శాఖ జిల్లా అధికారి పి సురేష్ గురువారం ప్రజాశక్తికి వివరణ ఇచ్చారు. ఆ కార్యాలయాన్ని దేశాయిపేట ఎఎంసి వద్ద ల్యాబ్‌కి మార్చినట్లు తెలిపారు. ఎడి కృష్ణ కిషోర్ మాట్లాడుతూ ఆ ఆఫీసుకు ఇద్దరు సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. అయితే వారికి అనారోగ్య సమస్యల వల్ల కార్యాలయం తెరవడం లేదని తెలిపారు. బదిలీ అవ్వటం గమనార్హం. ఉన్నతాధికారులే పొంతనలేని సమాధానాలు ఇవ్వటం చూస్తే

తాళం వేసి ఉన్న మత్స్య శాఖ కార్యాలయం

మత్స్యశాఖ అధికారుల సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. రెండేళ్ల క్రితమే రూ.లక్షలతో కార్యాలయం నిర్మాణం చేపట్టి ప్రారంభించారు. ఎట్టకేలకు నియోజకవర్గ పరిసర ప్రాంత ప్రజలకు మత్స్య శాఖ ద్వారా విశేష సేవలు అందుతాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. దీనిపై ప్రజాప్రతినిధుల సైతం పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు కలుగజేసుకొని కార్యాలయాన్ని తెరిచి ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆసరా చెక్కు అందజేస్తున్న మంత్రి నాగార్జున, అశోక్‌బాబు

జగన్ పాలనలో సంక్షేమం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని పోలీస్ స్టేషన్ దగ్గర రోడ్డుపై గురువారం వైఎస్సార్ ఆసరా 4వ విడత చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మి అధ్యక్షత వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగ నాగార్జున, వైసిపి వేమూరు ఇన్చార్జి వరికూటి అశోక్‌బాబు మాట్లాడారు. మండలంలో రూ.13.08కోట్లు మహిళలకు రుణమాఫీ పేరుతో బ్యాంకు అకౌంట్లో జమ చేసినట్లు తెలిపారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ ఆసరా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన 99శాతం హామీలను అమలు చేసినట్లు పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతని కొనియాడారు. 14ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఏనాడన్నా సంక్షేమ పథకాలు అమలు చేశారాని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో వైసిపికి ఓటేసి జగన్మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, డిఆర్‌డిఎ పిడి కృష్ణ, వేమూరు ఎఎంసి చైర్మన్ ఉప్పు శిరీష, ఎంపీపీ నాంచారమ్మ, వైసిపి మండల కన్వీనర్ రామకృష్ణ, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీడీఓ బిఎం లక్ష్మీ కుమారి పాల్గొన్నారు.

జిల్లా అభివద్ధిపై కలెక్టర్ దృష్టి

• మెరుగైన వసతులు, సేవలే లక్ష్యంగా గ్రామ దర్శినికి శ్రీకారం • 70 గ్రామాలకు ప్రత్యేక అధికారులు

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

జిల్లాలోని అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా మెరుగైన వసతులు, మేలైన ప్రభుత్వ సేవలు గ్రామీణులకు అందించాలన్న ఆలోచనతో కలెక్టర్ పి రంజిత్ బాషా గ్రామ దర్శిని కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాను మరింత అభివద్ధి పథంలో నడిపించడానికి కార్యచరణ ప్రణాళిక రూపొందించి తన ఆలోచనలకు కార్యరూపం ఇచ్చారు. గ్రామదర్శిని పేరుతో క్షేత్రస్థాయిలోకి పరిపాలన వ్యవస్థ వెళ్లేందుకు శ్రీకారం చుట్టారు. ప్రజలకు అందే సేవలు మరింత మెరుగ్గా ఉండాలని, బలోపేతం చేస్తూ మెరుగులు దిద్దాలని ప్రణాళికలు రచించారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రతి గ్రామాన్ని జిల్లా అధికారులు నిశితంగా పరిశీలించే బహత్తర కార్యక్రమం చేపట్టారు. గ్రామ దర్శిని పేరుతో ఒక్కొక్క గ్రామాన్ని ఎంపిక చేసి అక్కడ తిష్ట వేసి ఉన్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి నెల ఈ కార్యక్రమం కొనసాగేలా ప్రణాళికలు రూపొందించారు. ఇందుకోసం 77 మంది అధికారులను 70 గ్రామాలకు నియమించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. గ్రామ దర్శిని ద్వారా గ్రామ సచివాలయాలు, అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ వసతి గహాలు, ప్రభుత్వ పాఠశాలలు, వైద్య ఉప కేంద్రాలు, గ్రామ పంచాయితీ కార్యాలయాలను సందర్శించటమే దీని ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా బాపట్ల మండలం ఈస్ట్ బాపట్ల నందిరాజుతోట పంచాయితీలో కలెక్టర్ రంజిత్ బాషా విస్తతంగా పర్యటించారు. గ్రామ సచివాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నాడు - నేడు పాఠశాల అభివద్ధి పనులు, అంగన్ వాడి కేంద్రం, చెత్త సంపద కేంద్రం, పశువుల కొరకు వినియోగించే చెరువును సందర్శించారు. హైదరపేటలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు.

స్మృతివనం ప్రారంభిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా (ఫైల్)

నందిరాజుతోటలో గ్రామదర్శిని కార్యక్రమం ప్రారంభ సూచికగా తొలుత మొక్కలు నాటి స్మృతి వనం శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వ సేవలన్ని గ్రామ స్థాయిలో ప్రజల వద్దకు చేర్చడమే గ్రామదర్శిని కార్యక్రమం ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. ప్రజలతో ఆయన మమేకమై ప్రభుత్వ సేవలు, వసతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతున్నాయా అంటూ గ్రామ పెద్దలతోనూ ఆయన నేరుగా మాట్లాడుతున్నారు. ప్రజలకు మెరుగైన విద్యా, వైద్యం ఎక్కడ అందుతుందో ఆ ప్రాంతం పురోభివద్ధిలో పయనిస్తుందని చెప్పుకొచ్చారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆయా గ్రామాలలో అత్యవసరమైన వసతుల కల్పనపై అధికారులు దష్టి సారించాలని మార్గ నిర్దేశం చేశారు. ప్రతిపాదనలు, రూపొందించిన తదుపరి అంచనాల నివేదికలు తక్షణమే పంపాలని సూచించారు. ఇప్పటికే రెండు పర్యాయాలు గ్రామ దర్శిని కార్యక్రమాన్ని చేపట్టగా, 1,245 సమస్యలు అధికారులు గుర్తించారు. అందులో 1,000 సమస్యలు పరిష్కరించడంపై అధికారులను ప్రశంసించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామదర్శిని అమలు ద్వారా సమస్యల పరిష్కారానికి కలెక్టర్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి.

రైతు సంఘం సమావేశంలో కె రామకోటేశ్వరరావు

రైతు సమస్యలపై 16న నిరసన దీక్ష

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్న రైతుల పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న జరిగే రైతు కార్మిక సంఘాల నిరసన దీక్షను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు కోరారు. రైతు సంఘం నాయకులు ఎనికపాటి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల పంట రుణాలను మాఫీ చేయాలనే డిమాండ్లతో అనేక ఒడిడుకులు ఎదుర్కొంటు దేశవ్యాప్తంగా రైతు సంఘాలతో గడిచిన సంవత్సరం నుండి పోరాటం చేస్తుంటే రైతుల డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ప్రధాని మోడీ నేటి వరకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోలేదని అన్నారు. రైతులను దారుణంగా మోసం చేసాడని ఆరోపించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో తీసుకున్న వ్యవసాయ రుణాలను రద్దు చేయాలని అన్నారు. సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు, రైతు సంఘం నాయకులు వీరవల్లి కృష్ణమూర్తి, బొడెంపూడి సూరిబాబు, మోహనరావు, శేషాద్రి పాల్గొన్నారు.

గర్భిణీలకు పండ్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

గర్భిణులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

ప్రత్యేక వైద్య పరీక్షలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణీలకు జాతీయ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు దేవరకొండ రాము ఆధ్వర్యంలో గురువారం పండ్లు పంపిణీ చేశారు. వెదుళ్ళపల్లి పిహెచ్‌సిలో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ మానస ప్రియదర్శిని, వైష్ణవ కృష్ణ, పిహెచ్‌సి సిబ్బంది డి ప్రసాద్, పి పద్మ, జి రేపకా, ఎన్‌టిఎఫ్ సభ్యులు ఉయ్యాల శివకామేశ్వరి, వి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలింగ్ బూతును పరిశీలిస్తున్న జెసి గోపాలకృష్ణ

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - చీమకుర్తి

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ పరిశీలించారు. గురువారం ఆయన పోలింగ్ కేంద్రాలలో వసతులు కల్పించేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సాయి పాల్గొన్నారు.

అభ్యంతరాలను పరిశీలించి..పరిష్కరిస్తాం

రాజకీయ పార్టీల నేతలకు కలెక్టర్ దినేష్‌కుమార్ హామీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఓటర్ల జాబితాలోని మార్పులు, చేర్పులపై రాత పూర్వకంగా వచ్చే అభ్యంతరాలను, ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితా, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితాపై పార్టీలు సూచించిన అంశాలను పరిగణలోకి తీసుకొని తప్పొప్పులను సరి చేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఫారం-7 ధరఖాస్తులు 0.1 శాతం కన్నా ఎక్కువ వస్తే ఆ ఓట్లను తొలగించాలంటే రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరి అని ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనల మేరకు ఎన్నికల ప్రక్రియపై సంపూర్ణ అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మార్పులు, చేర్పులు పై వచ్చిన ఫారంలను డ్రైవ్ మోడ్ లో క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితాపై రాతపూర్వకంగా వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఆర్. శ్రీలత, వైసిపి రాష్ట్ర ప్రచార కమిటీ ప్రతినిధి దామరాజు క్రాంతి కుమార్, టిడిపి ప్రతినిధులు ఎం. కాలేషా బేగ్, స్వరూప్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎస్‌కె రసూల్, బిజెపి ప్రతినిధి సత్యనారాయణ, బిఎస్‌పి ప్రతినిధి ఎర్రయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నగరంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమోదం తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు గిరిజా శంకర్ శాండిల్యా, స్వాతి, నూకతోటి మస్తానమ్మ, షేక్ ఫాతిమాబీ, వెన్నపూస కుమారి పాల్గొన్నారు. నూతన కమిషనర్ ఎం జశ్వంతరావును సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.

మాట్లాడుతున్న మేయర్ సుజాత

వ్యవసాయాన్ని సంక్షోభంలో ముంచిన కేంద్రం

వ్యకాస జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-దొనకొండ

వ్యవసాయ రంగాన్ని కాపాడతామని చెప్పిన మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పజెప్పి వ్యవసాయాన్ని సంక్షోభంలో ముంచిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కర్నా హనుమయ్య అధ్యక్షతన దొనకొండలో గురువారం గ్రామీణ బంద్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టే గ్రామీణ బంద్ కార్యక్రమంను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.అంజిబాబు, ఎం.సంతోష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

నేడు గుర్రం జాషువా విగ్రహావిష్కరణ

కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ వెల్లడి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కవి కోకిల గుర్రం జాషువా కాంస్య విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ఆవిష్కరించనున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమానికి మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి, శాసనసభ్యులు, జడ్పీ ఛైర్‌పర్సన్, ఒంగోలు మేయర్, డివిఎంసి సభ్యులు, గుర్రం జాషువా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, దళిత, గిరిజన సంఘాల నాయకులను ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బాలల సంక్షేమమే ధ్యేయం

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో బాలల హక్కులు గెలవాలని, వారి సంక్షేమం 100 శాతం నెరవేరాలనే ఏకైక ధ్యేయంతో వివిధ అంశాలతో ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్‌సిపిసిఆర్) సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ప్రాంతీయ సదస్సు గురువారం జరిగింది. సదస్సులో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగాలు, కార్మికశాఖ, విద్యాశాఖ, పోలీసుశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు, బాలలతో కలిసి పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు. సదస్సుకు ఐసిడిఎస్ పీడీ కె.మాధురి అధ్యక్షత వహించారు. ఐదు జిల్లాల్లో ఇటీవల కాలంలో నమోదైన బాలకార్మిక కేసులు, వీరికి ప్రభుత్వం అందిస్తున్న మ్యాచింగ్ గ్రాంటుపై ఎటువంటి చర్యలు చేపట్టారు, లబ్ధి పొందిన వారి పూర్తి వివరాలపై కార్మికశాఖ అధికారుల నుండి ఆరా తీశారు. ఈ సందర్భంగా బత్తుల పద్మావతి మాట్లాడుతూ చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి మట్లాడుతూ రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై అవగాహన కల్పించే దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రాంతీయ స్థాయి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో నెల్లూరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సుజన, బాపట్ల ప్రాజెక్టు డైరెక్టర్, సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మా నాయక్, మెప్మా పీడీ టి.రవికుమార్, జడ్పీ డిప్యూటీ సిఇఒ సిహెచ్ హనుమంతరావు, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పద్మావతి

వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు చర్యలు

ప్రిన్సిపల్స్‌కు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మధుసూదనరావు ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం, బాపట్ల జిల్లాలోని కెజిబివిలలో చదువుతున్న టెన్త్, ఇంటర్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణులవటానికి ప్రిన్సిపల్స్ బాధ్యత తీసుకోవాలని పాఠశాల విద్య రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డి.మధుసూదనరావు ఆదేశించారు. స్థానిక కలెక్టర్ సమావేశ మందిరంలో గురువారం ప్రకాశం జిల్లాలోని 28 కెజిబివి, బాపట్ల జిల్లాలోని 4 కెజిబివిల ప్రిన్సిపల్స్‌తో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.మధుసూదనరావు మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్రంలో టాప్ టెన్‌లో కెజిబివి విద్యార్థులు ఉండే విధంగా ప్రిన్సిపల్ అందరూ కృషి చేయాలన్నారు. పబ్లిక్ పరీక్షల్లో టెన్త్ విద్యార్థులు ఎక్కువ మంది 500 మార్కులు పైన వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. ట్యాబులు, ఐఎఫ్‌బిలు ఎక్కువ ఉపయోగించి విద్యార్థుల నైపుణ్యం పెంపొందించాలని ఆయన సూచించారు. సబ్జెక్టు, పాఠశాల వారీగా ప్రిన్సిపల్స్‌తో చర్చించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా విద్యా శాఖాధికారి డి.సుభద్ర, జిసిడిఒ ఎం.ప్రమోద, ఏపిఒ సిహెచ్ మాధవీలత, బాపట్ల జిసిడిఒ చారులత, ప్రకాశం, బాపట్ల జిల్లాలలోని కెజిబివి ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మధుసూదనరావు

అట్టహాసంగా 'ఉగ్ర' జన్మదిన వేడుకలు

కనిగిరి పట్టణంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలను గురువారం కనిగిరిలో టిడిపి శ్రేణులు అత్యంత వేడుకగా నిర్వహించారు. డాక్టర్ ఉగ్ర 51వ జన్మదిన సందర్భంగా 51 కేజీల కేకును కట్ చేసి ప్రియతమ నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్వయం శక్తితో బతికేందుకు 40 మంది పేదలకు తోపుడు బండ్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులు తోపుడు బండ్లతో పట్టణంలోని ప్రధాన వీధుల్లో టీడీపీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుమహిళలు బధిరుల పాఠశాలలో కుర్చీలు పంపిణీ చేశారు. బెంగుళూరులో బెంగుళూరు టీడీపీ ఫోరమ్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగ్ర జన్మదిన వేడుకలు నిర్వహించారు. గుంటూరు, ఢిల్లీ, హైద్రాబాద్, గుజరాత్, విజయవాడలలోనూ టీడీపీ నాయకులు వేడుకలు నిర్వహించారు. విజయవాడలో నిర్వహించిన డాక్టర్ ఉగ్ర జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు కేక్ కట్ చేసి డాక్టర్ ఉగ్రకు తినిపించి.. శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ రావు , అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కొండపి ఎమ్మెల్యే స్వామి, మాజీ ఎమ్మెల్సీ రాజు ఉన్నారు. తిరుమల తిరుపతిలో టిడిపి శ్రేణులు ఉగ్రనరసింహారెడ్డి ఫొటోతో అలిపిరి మార్గంలో మెట్లపై కొండ ఎక్కి పూజలు నిర్వహించారు.

ఉగ్రకు కేక్ తినిపిస్తున్న అచ్చెన్నాయుడు

కనిగిరిలో జరిగిన వేడుకలలో కనిగిరి పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పిచ్చల శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి, షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, గుడిపాటి ఖాదర్, బుల్లా బాల బాబు, తమ్మినేని శ్రీనివాసరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, నంబుల కొండయ్య, సైకం మాలకొండరెడ్డి, బాలు ఓబుల్ రెడ్డి, నారప రెడ్డి శ్రీనివాసరెడ్డి, నారపరెడ్డి వెంకటరెడ్డి, చింతలపూడి తిరుపాలు, ఈదర రవి కుమార్, పాలూరి సత్యం, ఆర్‌వి నారాయణ, కరణం అరుణమ్మ పాల్గొన్నారు.

పామూరు: ఉగ్ర నరసింహారెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండలాల్లోని ప్రతి గ్రామంలో సంబరాలు చేసుకున్నారు. టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు కేక్ కట్ చేశారు. వికలాంగులకు మూడు చక్రాల బండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం రమణయ్య, ఎస్కే రహంతుల్లా, షేక్ మౌలాలి, శంకర్ పాల్గొన్నారు.

తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం